# 10

## గ్రహబలం

ఆ రోజు ఆదివారం. కాంతమ్మ తెల తెలవారుతుండగానే లేచి, వంట చేసింది. కాంతమ్మ భర్త మంగపతి, ఆదరా బాదరాగా నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని, అక్కడక్కడ పిగిలిపోయిన, నల్ల గుడ్డపై తెల్ల గుడ్డ కుట్టిన పాత కాలంనాటి గొడుగు చంకన పెట్టుకుని, గోతాం పట్టాతో కుట్టిన పంచిలో ఓ జత పంచెలూ, యింత పొగాకూ వేసుకుని, సంచి ఎడం చేత్తో పట్టుకుని, వర్జం జొరపడకముందే హడావిడిగా వీధి గడప మెట్లు దిగాడు.

మంగపతి మెట్లు దిగుతూనే "ఎక్కడ చచ్చావే ?" అంటూ ఒక్క కేక పెట్టి గిర్రున వెనక్కు తిరిగి ఇంట్లోకి దూసుకు వచ్చాడు.

"అయ్యో ! ఏమిటండీ ? ఏం జరిగిందీ ?" అంటూ రాగాలు దీస్తూ కాంతమ్మ, వాలు కుర్చీలో కూర్చున్న భర్త దగ్గరకు వచ్చింది.

"ఇంకేం జరగాలి ! అట్టా నువ్వన్నా ఎదురుగా వచ్చి చావకూడదూ?" అన్నాడు భర్త.

"అబ్బ ! అసలు సంగతేంటో తేల్చి చెప్పండి ?" అన్నది భార్య.

"అదే ఆ వెంకాయమ్మే ! గడప దిగుతుండగానే ఎదురు వచ్చింది !"

"అయ్యో రాత ! శుభమా అంటూ లగ్న నిశ్చయాలకు పోతూంటే, విధవే యెదురైందిగదా ?" నిట్టూర్చింది కాంతమ్మ.

అవును పాపం ! కూతురు మనువు మాట్లాడటానికి ప్రయాణమై పోతున్న మంగపతికి దుశ్శకునమైంది ! ఇంట్లో ఎదిగొచ్చి కూర్చున్న కూతురు పెండ్లి చేయాలని మంగపతి దంపతులు నానా యాతనలు పడుతున్నారు. కూతురు తారాదేవికి, తేవడానికి చాలా సంబంధాలే తెచ్చాడు మంగపతి.

కాని అన్నీ యేదో విధంగా బెడిసిపోతూనే ఉన్నాయి. వచ్చిన సంబంధం తల్లికి నచ్చితే కూతురుకు నచ్చేదికాదు, కూతురుకు నచ్చింది తల్లికి నచ్చేదికాదు. తల్లీ కూతుళ్ళకు నచ్చింది తండ్రికి నచ్చేది కాదు. సంబంధాలు వెతకలేక విసిగి వేసారిన మంగపతి, కూతురుకు బెనారస్ స్కూలుఫైనల్ చదువు చెప్పించడమే తన ఇన్ని కష్టాలకూ కారణం అనుకునేవాడు. లేకపోతే తారాదేవి, తను తీసుకొని వచ్చిన సంబంధాల్లో ఎవణ్ణో వకణ్ణి చేసుకుని ఈపాటికి ఇద్దరు బిడ్డల్ని యెత్తి దించేదని అనుకునేవాడు. కాని, వెంటనే తన మనసుకు తనే సర్ది చెప్పుకునేవాడు. దేనికైనా కాలం కలిసి రావాలి! బ్రహ్మరాత ఎలా గుందో! తారకు ఎవర్ని రాసిపెట్టి ఉందో?

మంగపతి దంపతులు కాస్త పాతకాలం మనుష్యులు. నొసటి రాతల్లోనూ, జాతకాల్లోనూ నమ్మకంగలవాళ్ళు.

కూతురు తారాదేవి జాతకం రాయించి భద్రంగా కొయ్యపెట్టె అడుగున దాచి ఉంచాడు మంగపతి. కూతురుకు పద్ధెనిమిదో ఏడు వెళ్తేకాని పెళ్ళికాదని జాతకంలో రాసి ఉందని మంగపతికి తెలియందికాదు. జాతకంలో నమ్మకం లేక కాదు. యిన్ని సంవత్సరాలనుంచి కూతురు పెళ్ళి విషయంలో పట్టుదల చూపింది! "అయినా మానవ ప్రయత్నం" అనుకునే మంగపతి.

మంగపతి వేళ్ళమీద లెక్క వేసుకొస్తున్న రోజులు, చూస్తూండగానే దొర్లిపోయాయి. కూతురు పద్ధెనిమిది నిండి పందొమ్మిదిలో కాలు పెట్టింది. జాతకం ప్రకారం యీ సంవత్సరంలో పెళ్ళి కావాలి. అనుకున్నట్టే ఓ మంచి సంబంధమే వచ్చింది.

మంచి రోజు చూసుకుని మంగపతి బయలుదేరాడు మనువులవాళ్ళతో మాట్లాడటానికి. కాని ఈ దుశ్శకునమైంది!

మంగపతి కాసేపు కూర్చొని మళ్ళీ బయలుదేరాడు. ఈ సారి ఏ అపశకునం రాకుండా ముందే జాగ్రత్త పడ్డాడు. భార్యను ఎదురు రమ్మన్నాడు.

కాంతమ్మ పెద్ద కానీఅంత కుంకంబొట్టు పెట్టుకుని దొడ్డిదోవన బయటికి పోయి, యింటి చుట్టూ తిరిగి వీధి వాకిలి ముందు కొచ్చింది. ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ, గడపలు దిగి వస్తోన్న భర్తకు ఎదురైంది.

మంగపతి వెనక్కు చూడకుండా వెళ్ళిపోయాడు. కాంతమ్మ లోపలికి వచ్చింది.

వసారాలో ఇదేమీ తనకు పట్టనట్టే కూతురు సినిమా పత్రిక చదువుకుంటూ కూర్చున్నది.

కాంతమ్మ భోజనాలయాక తాపీగా కూర్చుని వక్క పలుకు పటిక్ మనిపిస్తూ "అమ్మాయ్ ఆదివారం పత్రికేదే?" అన్నది.

పడక కుర్చీలో పండుకుని సినిమా పత్రికలో లీనమైపోయిన తార "ఏమో! ఎక్కడుందో చూసుకోవే!" అన్నది.

"అమ్మమ్మ కాస్త తెచ్చిపెట్టవే?" అన్నది కాంతమ్మ ఆయాసపడుతూ.

తార విసురుగా లేచి యింట్లోకి పోయి, కొంచెం సేపటికి ఓ పత్రిక తీసుకొచ్చి తల్లి ముందు పడేసిపోయి, మళ్ళీ ఆ సినిమా పత్రికలో తలదూర్చి కూచుంది.

కాంతమ్మ పత్రికలో వారఫలాలున్న పేజీ తీసి, తన రాశి అయిన "కర్కాటకం" క్రింద చదువుకుంది.

"ఈ వారం ఆరంభంలో ఎంతో కాలంగా చేస్తోన్న ప్రయత్నాలు, ఒక దారికి వస్తాయి. వెదకబోయిన తీగ కాళ్ళకు చుట్టుకుంటుంది. బంధు ఆగమనం. అపరిచితులవల్ల కొన్ని కార్యాలు నెరవేరుతాయి, శుభకార్యాలు!"

చదువుతూంటే కాంతమ్మ హృదయం ఆనందపు వెల్లువ అయింది.

'కూతురు తార గీత బయటపడింది. అచ్చుగుద్ది అలా రాసిపెట్టి ఉంటే యింకా సందేహం దేనికి?" అనుకుంది కాంతమ్మ మనసులో. "ఇవ్వాళో, రేపట్లో అమ్మాయి పెళ్ళి నిశ్చయమయిపోవాల్సిందేను!

"అది సరేకాని, వెతకబోయిన తీగ కాలికి చుట్టుకోవడం ఏమిటి చెప్మా!" అనుకుంది. "అయ్యో! నా తెలివి మండ! అంటే ఆ వియ్యాల వారే మనింటికి వస్తారన్నమాట! మరి అన్నట్టు "బంధు ఆగమనం" అనీ కూడా రాశాడుగా? అపరిచితులవల్ల కొన్ని కార్యాలు నెరవేరుతాయి.

"శుభ కార్యాలు" కూడా అన్నాడు. "నా మతి పోను!" ఇంకేం? వాళ్లే మన అమ్మాయిని వెతుక్కుంటూ యిక్కడికి వస్తారన్న మాట!

"ఈ మనిషి తెలివి దొంగలు దోల! తను యిట్లా పోయాడేం? వాళ్లే మన యింటికి వస్తూంటేను! అన్నట్టు ప్రొద్దునే జరిగిన అపశకునం ఈయన్ని యిల్లు వదిలి వెళ్ళొద్దనేనేమో? ఆ పోయే మనిషి వారఫలం చూసుకుని మరీ పోకూడదూ?"

కాంతమ్మకు ఈ ఆలోచనలు యిచ్చిన సంతోషంలో, అంతకుముందే తిన్న అన్నం కాస్తా హరించుకు పోయినట్టయింది!

వియ్యాలవాళ్ళు ఏ వేళప్పుడొస్తారో ఏమో? ఎందుకన్నా మంచిదని ఇంత మినపప్పు నీళ్ళలో వేసి, కాఫీపొడి, పంచదార డబ్బాలు తనిఖీ చేసుకొచ్చింది.

"వోసే అమ్మాయ్! ఆ పుస్తకం అవతల పారేసి ముఖం కడుక్కుని బెంగుళూరు పట్టుచీర గులాబి వన్నెది–కట్టుకో! ఏ సమయంలో వస్తారో ఏమిటో?" అని కాంతమ్మ కూతుర్ని పురమాయించింది.

ఆ వీధిన బండి చప్పుడయినప్పుడల్లా, తమింటికే ఎవరో వస్తూన్నట్టు భావించి కాంతమ్మ వాకిట్లోకి వచ్చి తొంగి చూసి పోతూంది. కాంతమ్మగారి యింటి మీదగా కాకి రెండుసార్లు అటూ, ఇటూ, తిరిగి ప్రహారీ గోడమీద వాలి, కాంతమ్మకు ఎదురుగా కూర్చుని "కావు కావు" మని అరవసాగింది.

"ఒసి నీ దుంపతెగ! రాయభారం కూడా వచ్చావ్! అయితే చుట్టాలు తప్పకుండా వస్తారంటావ్!" అని అడిగింది కాకమ్మను కాంతమ్మ మురిపెంగా.

అంతలోనే వీధిలో గుర్రం బండి వస్తున్న చప్పుడయింది. కాంతమ్మ గుండెలు గబ గబా కొట్టుకున్నాయి. బండి చప్పుడు యింటిముందే ఆగి పోయింది. ఎవరో్నే పిలుస్తున్నట్టు లీలగా వినపడింది.

"వోసే పిల్లో! నువ్వు యింటోకి పో!" అని కూతుర్ని హెచ్చరించి కాంతమ్మ వక్క పరుగున వీధి వాకిట్లోకి వచ్చి వాలింది.

బండిలోంచి వయస్సు మళ్ళిన ఓ బుర్రమీసాల మొహం బయటికి తొంగి చూస్తూ అడిగింది.

"మంగపతిగారు లేరండీ ?"

"ఇదే ! రండీ !" అంటూ కాంతమ్మ సగం పైగం తెరిచివున్న తలుపు వెనక్కు లాక్కుంది.

బండిలోంచి కూలింగ్ గ్లాస్ పెట్టుకుని, ఓ పాతిక సంవత్సరాల యువకుడూ, ఆ బుర్ర మీసాలాయన, ఇంకో పెద్దమనిషి దిగి యింట్లోకి వచ్చారు.

బంధువులకు కాళ్ళకు నీళ్ళిచ్చి, మధ్య హాల్లో కూర్చోపెట్టి, పక్క గదిలో రెండు మంచాలు వాల్చి పక్కలు వేసింది కాంతమ్మ.

కాళ్ళు కడుక్కొచ్చి కూర్చుంటూ బుర్రమీసాలాయన "మంగపతిగారే రండి ?" అని అడిగాడు.

"ఊరెళ్ళారు. సాయంకాలానికి తిరిగొస్తారు !" అని సమాధానం చెప్పి వంటింట్లోకి వెళ్ళింది. కాఫీ, ఫలహారాలు తయారుచెయ్యడానికి.

బంధువుల్లో పెద్దవాళ్ళిద్దరూ, జట్కాబండి కుదుపులకు వళ్ళు హూనం అవడంవల్లనో, ప్రయాణపు బడలిక వల్లనో, మంచాలమీద పడుకుని కాసేపటికే గుర్రు కొట్టడం మొదలు పెట్టారు.

యువకుడు మాత్రం, హాల్లో కూనిరాగాలు తీస్తూ పచార్లు చేస్తూ మధ్య మధ్య కుడివైపున వున్న గదిలోకి వోరచూపులు చూస్తూ తిరుగుతున్నాడు.

బీరువా మీదున్న పాత మాగజైన్లు వెతుకుతూండగా, అతనికి ఓ మధుర కంఠం వినిపించింది! యువకుడు ఆ ధ్వని వచ్చిన గదివైపుకు చూశాడు.

తారాదేవి బాగా ముస్తాబయి, చేతిలో సినిమాతార త్రివర్ణ ముఖ చిత్రంగల ఓ సినిమా పత్రిక పట్టుకుని, ఓర వాకిలిగా వేసివున్న తలుపు ప్రక్కన కనపడీ, కనపడకుండా నుంచుంది.

"ఇదిగోనండి !" తారాదేవి, చేతిలో ఉన్న పత్రికను తలుపు చాటున నుంచునే అందించింది.

అతను ఆమెకు కొంచెం యెడంలో నుంచునే "ఇలా ఇవ్వండి" అన్నాడు.

ఆ పెద్దమనుషులిద్దరూ కునుకు తీస్తుండగా, కాంతమ్మ వంటింట్లో గారెలు "సుఁయ్, సుఁయ్" మనిపిస్తుండగా కలిగిన అవకాశాన్ని, అతడూ, ఆమె, జారవిడుచుకోలేదు.

ఆ గంటలోనే వాళ్ళు చాలా విషయాలు మాట్లాడుకున్నారు.

నిన్నే చేసుకుంటానన్నాడు ఆ అబ్బాయి. నిన్ను తప్ప ఇంకెవర్నీ చేసుకోనంది ఆ అమ్మాయి. ఇవి వాళ్ళ చూపుల్తోనే చెప్పుకున్న మాటలే అనుకోండి.

నాలుగ్గంటలకల్లా వియ్యాలవారు కాఫీలు త్రాగటం అయింది.

బుర్ర మీసాలాయన చుట్ట వెలిగించుకుని పీలుస్తూ అన్నాడు.

"అయితే, మంగపతిగారు ఏ ఊరు వెళ్ళినట్టు?"

"మీతో మాట్లాడాలనే గుంటూరు వెళ్ళారు. మీరిక్కడ కొచ్చిన సంగతి తెలుసుకుని ఈ పాటికి తిరిగొస్తూండాలి!" అని దర్వాజా కానుకుని కాంతమ్మ సమాధానం చెప్పింది.

"అహాఁ! బాపట్ల వెళ్ళారా?" అన్నాడు ఆయన.

"కాదండీ! గుంటూరు!" అన్నది ఆవిడ.

వియ్యాలవారు విస్తుపోయారు. బుర్ర మీసాలాయన తెప్పరిల్లుకుని అన్నాడు. "మాది బాపట్లండి! బాపట్లనుంచి వస్తున్నాం! మీ ఇంటిపేరు ఒంటిమిట్టవారు గదూ?"

కాంతమ్మ గుండెలు చిక్కపట్టినయ్!

"మా యింటిపేరు వేదాంతంవారు! మా నాన్న వేదాంతం మంగపతి అండీ!" అన్నది తల్లి వెనక కూర్చున్న కూతురు.

"ఎంత పొరపాటు! ఎంత పొరపాటు జరిగింది? మేం వచ్చింది ఒంటిమిట్ట మంగపతిగారి కోసం! లేవండ్రా! ఇంకా కూర్చున్నారేం?" అన్నాడు బుర్ర మీసాలాయన. ఆ కుర్రాడు, తారవంక జాలిగా చూస్తూ పెద్దవాళ్ళ వెనక కుక్కపిల్లలా పోయాడు.

కాంతమ్మకు నోట మాట రాలేదు. తారకు దుఃఖం పొర్లుకు వచ్చింది.

ఏదో జరగరాని అవమానమే జరిగినట్టు భావించింది కాంతమ్మ. నిరాశ నిస్పృహా, అవమానంతో కాంతమ్మ మనసు దహించుకు పోయింది.

వాళ్ళు తిని ఖాళీ చేసిన ప్లేట్లు, పొర్లాడి పోయిన పక్కాలూ చూస్తూంటే కాంతమ్మకు వళ్లు మండిపోయింది.

కాసేపు మంచంమీద వత్తిగిల్లుదామని కాంతమ్మ మంచం దగ్గరకు పోగానే అక్కడే వున్న పత్రిక ఆమె దృష్టిలో పడింది. ఒక్కసారిగా ఎక్కడలేని కోపం వచ్చేసింది ఆ పత్రికమీద కాంతమ్మకు. అట్టా తెరిచి "తారాబలం-చంద్రబలం" కేసి చూసింది.

"ఈ ముదనష్టపాడు మరి యిట్టా రాశాడేంటీ ?" అనుకుంటూ మళ్ళీ "కర్కాటకం" రాశిక్రింద చదవసాగింది.

"మీరు యీ వారంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఆప్తులవలె వచ్చి మిమ్మల్ని మోసగించటానికి ప్రయత్నం చేస్తారు. శరీరకష్టం ! ఖర్చు. కుటుంబంలో అశాంతి కలిగే సూచన—"

కాంతమ్మ తన కళ్ళను తనే నమ్మలేక పోయింది ! మళ్ళీ మళ్ళీ చదువు కుంది. పత్రిక అటూ యిటూ తిప్పి చూసింది. అయితే తను మధ్యాహ్నం చదివిన పత్రిక కాదే యిది ?

వరండాలో బల్లమీద తను ముందు చదివిన పత్రిక తీసి తారీఖు చూసింది.

అది పోయిన ఆదివారం పత్రిక ! !

"ఒసి నీ తాడుతెగ ! ఎంతపని చేశావే?" అన్నది కూతుర్ని కాంతమ్మ. తార మంచంమీద బోర్ల పండుకుని వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టింది.

ఈ వారం తనకు అక్కడ రాసిపెట్టినట్టె జరిగిందిగదా అనుకుంది కాంతమ్మ. ఎంత మోసం ! కష్టానికి కష్టం, ఖర్చుకు ఖర్చూను ! పైగా

కుటుంబంలో అశాంతి! ఆయనొస్తే ఈ సంగతి తెలిసి యెంత గొడవ చేస్తాడో? పాపం కాంతమ్మ మథనపడ సాగింది.

"నువ్వెందుకే ఏడుస్తావ్?" అన్నది కాంతమ్మ కూతుర్ని.

"నేను ఆయన్ని ప్రేమించానే! అతన్ని తప్ప ఇంకెవర్నీ చేసుకోను!" అన్నది కూతురు.

కూతురు వాలకం చూస్తూంటే కాంతమ్మకు మతి పోయినంత పనైంది.

అప్పుడే బండి దిగి వియ్యాలవారిని తీసుకు వస్తూన్న భర్త వేదాంతం మంగపతిని చూసిన కాంతమ్మకు కాళ్ళక్రింద భూమి కదిలిపోతూన్నట్టయింది!

"ఆంధ్రప్రభ వారపత్రిక - '54